# పున్నాగ చెట్టు

- ముదిగొండ శివకౌముదీ దేవి

పొదవాటి చెట్ల మధ్య నుంచి, నల్లని వాటి నీడల మధ్య నుంచి నడచుకుంటూ ఆ క్వార్టర్ చేరుకున్నాను. ఐ.బి.-1 అని వ్రాసుంది. ఐ.బి. అంటే ఇండిపెండెంట్ బంగ్లా అన్నమాట. ఇనప గేటుకి డా॥ డి.సూర్యనందన్ అని బోర్డుంది.

కటకటాల వరండా మెట్లమీద నిలబడి కాలింగ్ బెల్ నొక్కాను. లోపల నుండి సూర్యనందన్ గారు వచ్చారు.

తలుపు తీసి ఎవరన్నట్లుగా చూశారు.

"నేను వీరవెంకట నాగపూర్ణనండీ. తల్లిపాల వారోత్సవం గురించి వ్యాసం వ్రాస్తున్నాను. మీరు పిల్లల డాక్టరని మీతో మాట్లాడాలని వచ్చాను. డా॥ కృష్ణారావు గారు పంపించారు" అన్నాను.

''రండి. కూర్చోండి' అంటూ ఎంతో మర్యాదగా ఆహ్వానించారు.

వైర్ సోఫాలో కూర్చున్నాను.

లోపలికి వెళ్లి మంచినీళ్లు తెచ్చి ఇచ్చారు.

కొద్దిసేపట్లోనే మాటల్లో మునిగిపోయాం. చివర్లో "నాగలక్ష్మీ" అంటూ పిలిచారు.

కొద్ది క్షణాల్లో ఓ అందమైన యువతి గుమ్మంలోకి వచ్చింది. నారింజ రంగు బెంగాల్ కాటన్ చీర కట్టుకుంది. నిమ్మపండు ఛాయలో మనిషి. నుదుట ఎర్రగా మెరిసే ఉదయ సూర్యుడి లాంటి కుంకుమతో, చక్కని కనుముక్కు తీరుతో- కుదురుగా, పొందికగా- అన్నింటికన్నా ముఖ్యంగా ఆహ్లాదకరంగా ఉన్నది.

ఆవిడ కన్నా ఆవిడ చీర కుచ్చిళ్లు పట్టుకుని, వెనకగా నుంచుని తొంగి చూస్తున్న ఆ ఇద్దరు ఆడపిల్లలు వాన కురుస్తుంటే తల్లి కోడిపెట్ట రెక్కల క్రింద నుంచున్న కోడి పిల్లల్లాగా ముద్దుగా ఉన్నారు.

"నమస్కారమండీ" అన్నాను.

చిరునవ్వుతో ఆవిడ కూడా ప్రతినమస్కారం చేసింది.

"మా మిసెస్. ఇటీవలే అమెరికా వెళ్లొచ్చింది వాళ్ల సిస్టర్ డెలివరీకి. అక్కడి విశేషాలు కూడా చెబుతుంది" అన్నారు డా॥ సూర్యనందన్ గారు.

కాస్సేపు ఆవిడతో మాటలయ్యాక వారి దగ్గర సెలవు తీసుకున్నాను. ఇద్దరు పిల్లలు అనిత- సునీత- ముద్దుగా టాటా చెప్పారు.

మళ్లీ పెద్ద పెద్ద చెట్ల కొమ్మల మధ్య నుంచి కురుస్తున్న వెలుతురులో పరచుకుంటున్న దీర్ఘఛాయల మధ్య నిశ్శబ్దంగా ఉన్న రోడ్డుపై ఒంటరిగా నడుచుకుంటూ వచ్చేశాను. క్యాంపస్ దాటి బయటికి రాగానే ఒకటే సందడి.

అదీ నాగలక్ష్మి గారితో నా తొలి పరిచయం. ఆ రోజు డా॥ సూర్యనందన్ గారు తన భార్యకు పరిచయం చేసినప్పుడు కాస్త పని హడావిడిలో "ఇప్పుడీవిడతో కూడా మాట్లాడాలా?" అనుకున్నా. ఆ తర్వాత మేమిద్దరం మంచి మిత్రులం అయిపోయాం.

తరచూ ఫోన్‌లోనో, కలుసుకునో మాట్లాడుకునే వాళ్లం. నాగలక్ష్మి గారు ఆంధ్రా బ్యాంక్‌లో ఆఫీసరు. ఆవిడ బ్యాంకు కబుర్లు, నేను నా పత్రికాఫీసు కబుర్లు చెప్పుకునే వాళ్లం.

నాగలక్ష్మి గారు చాలా మర్యాదస్తురాలు. వాళ్లింటికి వెళ్లినప్పుడల్లా చక్కని కాఫీ ఇచ్చేవారు. ఇంకా బిస్కెట్లు, పళ్లు, చిప్స్, లడ్డూలు ఏదో ఒకటి తప్పక పెట్టేవారు. తినేదాకా వదిలేవారు కాదు.

ఆవిడ పరిచయమై, వాళ్లింటికి వెళ్లి తినడం మొదలెట్టాక నేను ఐదు కిలోలు బరువు పెరిగాను.

నేను సాధారణంగా ఆఫీసు నుండి ఇంటికి వెళుతూ ఏ ఎనిమిదిన్నరకో వాళ్లింటికి వెళ్లేదాన్ని.

నిశ్శబ్దంగా ఉన్న మెడికల్ కాలేజ్ క్యాంపస్‌లో నా మోపెడ్ నిదానంగా డ్రైవ్ చేస్తూ ఏదో ఆలోచిస్తూ వాళ్లిల్లు చేరేదాన్ని. ఉమెన్స్ హాస్టల్

ప్రక్కనే వాళ్ల ఇల్లు. ఆ దారంతా ఈవినింగ్ వాక్ చేస్తూ ఆడపిల్లలు– అక్కడక్కడా జంటలు– వాళ్లని చూస్తే విచారంగా ఉండేది. ఎంతో కష్టపడితే కానీ సీటు రాదు మెడిసిన్‌లో– అందునా ప్రభుత్వ కళాశాలలో, కాలేజీలో చేరినప్పటి నుంచీ అంతకుముందు ధృవతార లాగా కనిపించిన మెడిసిన్ వాళ్లకి చులకనైపోతుంది. అప్పుడే డాక్టర్లమైపోయామనుకుంటారో– పెద్దవాళ్లమై పోయామనుకుంటారో ఈ పద్దెనిమిదీ– ఇరవై ఏళ్ల పిల్లలు– అప్పుడే ప్రేమ వ్యవహారాలు– ఇవి టైంపాస్ ప్రేమలో– సీరియస్ ప్రేమలో తెలియదు.

చదువూ సంధ్యా మానేసి బైక్‌ల మీద షికార్లు. పొదల మాటున తొందరపాటుతనాలు.

తరచూ వాళ్లింటికి వెళ్తుండగా ఒకసారి నన్ను క్రొత్త సౌరభం చుట్టుముట్టింది. ఒక విచిత్రమైన, మత్తిల్లజేసే సువాసన ఎక్కడినుండో నన్ను కమ్ముకుంది. వారింటి ఆవరణలో నా బండి పార్క్ చేసి తాళం వేసి ఆ సౌరభం ఎక్కడి నుంచా అని అన్వేషించాను. వాళ్ల ఆవరణలో ఎక్కువగా మొక్కలేమీ లేవు. ఏవో పెరట్లో చెట్లు తప్ప సువాసననిచ్చే పూలమొక్కలు కనిపించలేదు.

సరే! లోపలికి వెళ్లిపోయాను. యథాప్రకారం ఫలహారం, కబుర్లు, కాఫీ. రాత్రి తొమ్మిదింటికి కూడా ఆవిడ కాఫీ ఇవ్వకుండా పంపించరు.

నేను వెళ్లిపోతుంటే బయటిదాకా వచ్చి వీడ్కోలు చెబుతారు. అయితే సాధారణంగా ఆ వీడ్కోలు మిషతో మరో పది నిముషాలు మళ్లీ కబుర్లు చెప్పుకుంటూ ఉంటాం.

పైనుంచి లేత వెన్నెల పడుతోంది.

"ఇంత మంచి సువాసన ఎక్కడ నుంచీ?" అన్నాను ఆశ్చర్యంగా చుట్టూ కలయజూస్తూ.

"పున్నాగ చెట్టు" అన్నారు నాగలక్ష్మి గారు ప్రహరీ బయటికి చూపిస్తూ.

ఇరవై అడుగుల ఎత్తుంది ఆ చెట్టు. ఒక పెద్ద వృక్షంలా ఉంది. అది పూల చెట్టని నేను అనుకోనేలేదు. కానీ ఆ చెట్టునిండా గుత్తులు గుత్తులుగా పూలు. పదడుగుల ఎత్తు వరకూ కాండం. ఆపైన పూలగుత్తులు, ఆకులతో నిండిన కొమ్మలు. తెల్లగా, సన్నగా, పొడుగ్గా కాడలతో వున్న ఆ విచ్చుకున్న అందమైన పూలు ఆ మెడికల్ కాలేజీ ఆవరణలో ఆడపిల్లల నవ్వుల్లా ఉన్నాయి. పూలు చూస్తే అతి సుకుమారంగా ముట్టుకుంటే వాసిపోతాయేమో, వడలిపోతాయేమో అన్నట్లున్నాయి. కానీ ఆ సౌరభం!

ఆ సౌరభంలోని గుణం ఏమిటో నాకు అకస్మాత్తుగా తట్టింది. అది చాలా, చాలా, చాలా అరుదైన పరిమళం.

ఎంతో ప్రయత్నం మీద తయారయ్యే ఫ్రెంచి పర్‌ఫ్యూమ్‌లాగా– ఎన్నో సంవత్సరాల శ్రమ తర్వాత భూమిలోంచి బయటికి తీసే విదేశీ మద్యంలాగా– చక్కటి తెలుగు, సంస్కృత పదాలు ఏర్చికూర్చి అతి చక్కని నవపాసాలతో, అలంకారాలతో అల్లిన అందమైన ప్రాచీన పద్యంలాగా– అన్నింటికన్నా ముఖ్యంగా అది ఏ దేవలోకంలోని ఉద్యానవనం నుంచో తెచ్చి భూమిపైన నాటిన వృక్షం అనిపిస్తూ– అమృతానికి పరిమళం ఉంటే ఇలాగే ఉంటుందేమోననిపిస్తూ– ఆ పరిమళం–


ఆ పువ్వు నిర్మాణంలోని హొయలు ప్రాచీన శిల్పాన్ని జ్ఞప్తికి తెస్తే– ఆ పూరేకులోని సౌకుమార్యం– సోయగం– లేత ప్రాయంలోకి అడుగుపెట్టే ఆడపిల్లలాగా– కాదు– అది సరైన పోలిక కాదు– ఆ పువ్వు సౌకుమార్యం గట్టిగా గాలేస్తే రాలిపోయే పూలతీగ లాంటిది. శీతాకాలపు ఉదయ సూర్యకిరణం తాకిడికే వాడిపోయే చిగురుటాకు లాంటిది. గాలికే ఆవిరయ్యే కర్పూరం వంటిది.

ఆ సౌరభం– అందులో మృదుత్వం ఉన్నది.

కానీ అంతకు మించిన మాదకత ఉన్నది.

కాసేపు ఆ చెట్టు మీద నుంచి వీచే గాలి పీల్చుకుంటే నేనేదో లోకానికి పోతున్నాననిపించింది. అక్కడే ఆ మట్టిలోనే పడుకుని నిద్ర పోవాలనిపించింది. ఖచ్చితంగా మంచి కలలే వస్తాయనిపించింది. మా ఇంటి పెరట్లో ఆ చెట్టుంటే నాకు ఆకలిదప్పులే ఉండవని అనిపించింది.

నేను నా జీవితంలో పున్నాగచెట్టును చూడటం అదే మొదటిసారి. ఆ క్షణంలో నాకేదో కొత్త జీవిత




సత్యం తెలిసినట్లనిపించింది. తెల్లని పూలగుత్తులు ప్రేయసిలా ఆ చెట్టుని అల్లుకుంటే– ఇంత అందం నాది సుమా అని ఆకాశానికి చాటిచెబుతున్నట్లు నిలబడ్డ ఆ చెట్టు ఠీవి, గాంభీర్యం చెప్పనలవికాకుండా ఉన్నాయి.

ఆ క్షణంలో నేను పున్నాగ చెట్టుతో– ఆ పున్నాగ చెట్టుతో ప్రేమలో పడిపోయాను. నాకు తెలియనే లేదు చాలాకాలం వరకూ.

ఆ తర్వాత నేను నాకు తెలియకుండానే వాళ్లింటికి ఎక్కువగా రాకపోకలు సాగించాను. ప్రత్యేకించి లేట్ ఈవెనింగ్స్. నాకు ఆఫీసులో తొమ్మిది అవుతుండేది. ఒక్కోసారి పదీ, పదకొండూ కూడా.

పెందరాడే పనైపోయిన రోజున వాళ్లింటికి వెళ్లేదాన్ని. కబుర్లు, కాఫీ, ఫలహారం మామూలే.

కొన్నిసార్లు అక్కడే భోజనం కూడా.

మేం వీధిలో కబుర్లు చెప్పుకుంటుంటే పున్నాగ చెట్టుమీంచి గాలి గర్వంగా వీచేది. అప్పుడప్పుడూ గాలికి ఆ పూలగుత్తులు రాలి చెట్టు మొదట్లో పూలవానజల్లు కురిసేది. నా మనసు మురిసేది.

పున్నాగ చెట్టు చిటారు కొమ్మలపై అలముకున్న చీకటిని చెరిపేస్తూ ఆ చెట్టు అంచులపై చంద్రుడు ఉదయించేవాడు. క్రింద పున్నాగ పూలగుత్తులతో, మధ్యన చీకటిగా వున్న ఆకులు, కొమ్మలు, ఆపైన వెలుగుతున్న చంద్రుడితో ఆ చెట్టు చీకటితో సముద్రంలాగా వున్న ఆకాశంలో తెరచాప దీపంతో ప్రయాణిస్తున్న పూల పడవలా ఉండేది.

ఆ పున్నాగపూల ముగ్ధత్వం నన్ను ఇంటిదాకా వెంటాడేది. వాటి లాలిత్యం ముందు నా మనసు తివాచీలా పరిచాను.

ఒక కొమ్మ తెచ్చి ఆ చెట్టు మా ఇంట్లో కూడా పెట్టుకుందామా అనుకునేదాన్ని. ఇలా ఆ శీతాకాలం గడిచింది.

లేత చలిగాలులు, పైనుంచి కురిసే మంచు, నిశ్శబ్దంగా కాలేజి ఆవరణ, టర్మ్ పరీక్షలకి చదువుకుంటూండటం వల్ల వీధిలో కనిపించని వైద్య విద్యార్థులు- ఎండుటాకుల గలగలలు- దూరంగా ఎవరిదో అడుగుల సవ్వడి- అరుదుగా ఒక స్కూటర్ శబ్దం- యథాప్రకారం వీధి ప్రక్కన గేటు దగ్గర నేనూ, నాగలక్ష్మి గారూ-

చీకటిలో వాళ్లింటి ముందు ఆ ఉదయం వేసిన అందమైన ముగ్గు- తెల్లగా ముత్యాలతో వేసినట్లు మెరుస్తూ వెలుగునిస్తూండేది. దీపావళి మతాబా నుంచి రాలే పువ్వుల్లా ఆ ముగ్గు వాళ్ల వాకిలిని వెండి దీపమాలికగా చేసేది.

"మీ ఇంటికి వాకిట్లో దీపం అక్కర్లేదు- ఈ ముగ్గు చాలు-" అనేదాన్ని నేను.

అక్కడ నుంచి కదలబుద్ధి అయ్యేది కాదు. వాళ్లని ఇబ్బంది పెడుతున్నానేమో తరచూ వచ్చి- అనుకుంటూనే రాకుండా ఉండలేక పోయేదాన్ని.

ఏదో మంత్రముగ్ధమైనట్లు- ఎవరో పిలిచినట్లు- నా మనసుని ఎవరో ఒక అదృశ్య బంధనంతో లాగుతున్నట్లు- కదలి వచ్చేదాన్ని.

బహుశా అచ్చంగా పున్నాగ చెట్టే కాదు- ఆ విద్యాలయం- అక్కడి విద్యార్థి లోకం- ఆ చెట్లు- ఆ నిశ్శబ్దం- ఆ వెన్నెల- వాళ్లింటి వాకిలి- అక్కడి ప్రశాంతత నన్ను ఆకర్షించి ఉండవచ్చు.

అన్నింటినీ మించి నాగలక్ష్మి గారి ఆతిథ్యం, మన్నన- మరీ ముఖ్యంగా ఆవిడ స్నేహపాత్రత.

ఎప్పుడో మాకు తెలియకుండానే నా మనసులో ఆవిడ స్నేహానికీ, ఆ పున్నాగ చెట్టుకీ ఒక మెలిక పడిపోయింది.

నా హృదయమంతా ఆ వాతావరణం అలముకుంది. వారానికి మూడుసార్లు అటు వెళ్తుండేదాన్ని.

ఈలోగా నాకు ప్రమోషన్ వచ్చి హైదరాబాద్ వెళ్లాను. మూణ్ణెల్లదాకా మళ్లీ మా ఊరు వెళ్లడం పడలేదు. మూడు నెలల తర్వాత వేసవి ముగిసి వర్ష ఋతువు ప్రారంభమయ్యే జూలైలో మా ఊరు చేరాను.

అందరినీ పలకరించి సాయంత్రం నాగలక్ష్మి గారింటికి బయల్దేరాను.

అప్పటికే చిరుచీకట్లు పరచుకున్నాయి ఊరంతా. వీధి దీపాలు వెలిగాయి. వాహనాల రొదలు, హడావిడి మధ్య నుంచి మళ్లీ ఆ వైద్య కళాశాల ఆవరణలోకి ప్రయాణం. రోడ్డుకిరువైపులా ఉన్న పొడవాటి చెట్ల కొమ్మలు కలిసిన ఆర్చీ క్రిందుగా నడుస్తూ- మళ్లీ ఆ మసక వెన్నెల నీడల మీదుగా నాగలక్ష్మి గారింటికి చేరాను.

ఒకటే సంతోషం- కబుర్లు- నవ్వులు.

పిల్లల కోసం తెచ్చిన బిస్కెట్లు ఇచ్చేసి- బయటకు వస్తుంటే వాళ్లింటి ముందు బోసిగా అనిపించింది.

ముందు ఏదో తేడాగా అనిపించింది.

ఏమిటో అర్థం కాలేదు.

ఆ తర్వాత ఒక చల్లని మంచు గాలి ముఖాన కొట్టినట్లు వాస్తవం స్ఫురించింది.

"అయ్యో! పున్నాగ చెట్టేదీ?"- నాగలక్ష్మి గారిని అడిగాను షాక్‌తో ఆశ్చర్యంగా, బాధగా.

"ఆc మొన్న వేసవి కాలంలో పెద్ద గాలివాన వచ్చింది. క్యాంపస్‌లో పెద్ద చెట్లు కొన్ని పడిపోయాయి. మా ఇంటిముందు టెలిఫోన్ స్తంభం పడిపోయింది. వారం రోజులు ఇబ్బందిపడ్డాం. అప్పుడే పిడుగుపడి ఈ పున్నాగ చెట్టు నిలువునా మాడి మసైపోయింది" అన్నారామె విచారంగా.

నామీదే ఆ పిడుగు పడినట్లనిపించింది.

నా కలల వృక్షం- వృక్షం ఏమిటి?- వృక్షం రూపంలో వున్న పున్నాగ తోట బూడిదైపోయిందా? ఒక చెట్టే నాకు ఒక తోటలాగా అనిపించిందంటే అదెంత విరగబూసి ఉండాలి? నన్నెంత ఆహ్లాదపరచి ఉండాలి?

ఈ రోజు ఈ సాయంత్రం వేళ లేతదనాన్ని పోగొట్టుకుంటూ- మరింత వయస్సుని

సంతరించుకుని రాత్రిగా ముదిరిపోతున్న ఈ సమయంలో ఆ అందమైన సుకుమారమైన పూలవృక్షం– నా మనసుపై మంచి గంధం కలిపిన పన్నీరు చల్లిన చెట్టు– నాలో ఏవేవో భావాలను నిద్రలేపి–

నాకు జీవితాన్ని కొత్త కోణంలో చూపించిన వృక్షం– ఆ చెట్టు పైనుంచి వెన్నెల కురుస్తుంటే ఆ పూల సౌరభం వెన్నెలదా– ఆ వెన్నెల చల్లదనం ఆ పూలదా అనిపించేలా వెన్నెలతో తాదాత్మ్యం చెందిన వృక్షం– చచ్చి బూడిదయ్యిందంటే నాకు దుఃఖం పొంగివచ్చింది. కానీ ప్రకటించలేకపోయాను.

ఒక కొండ బాటలో నడుస్తూ లోయలో పడిపోయినట్లు తోచింది.

"అయ్యో" అని ఒక మాట అనగలిగాను.

అప్పుడే నాకు తెలిసింది విచారం– విషాదం ప్రకటించడానికి అయ్యో అనేది ఎంత చిన్న మాటో– దానిలో డొల్లతనం ఎలాంటిదో!!

కాసేపు ఏవో మాట్లాడి వీడ్కోలు చెప్పి వచ్చేశాను. తోరణం లేని గడపలాగా– ముగ్గు లేని ముంగిలిలాగా– మొక్కల్లేని పెరడులాగా– పున్నాగ చెట్టు లేని వాళ్ల వాకిలి తోచింది. ఒక చెట్టుతో ఒక మనిషికి ఇంత అనుబంధమా అని ఆశ్చర్యపోయే వాళ్లుండవచ్చు. స్టుపిడ్ రొమాంటిసిస్ట్– అని నన్ను అనుకునేవాళ్లూ ఉండవచ్చు.

అయినా నేనా షాక్‌లోంచి తేరుకోలేకపోయాను.

ఏడుపేమీ రాలేదు. అయినా దుఃఖం.

దుఃఖం అంటే ఏడుపూ, కన్నీళ్లే కానవసరం లేదని నాకు అప్పుడర్థం అయింది.

నేను హైదరాబాద్ వెళ్లి డ్యూటీలో చేరాను.

యథాప్రకారం వార్తలూ, వ్యాసాలూ, నేనూ, ఆఫీసూ, మిత్రులూ– అదే వరుసలో.

ఆ తర్వాత మూణ్ణెల్లకి నాకు మళ్లీ మా ఊరికే బదిలీ అయింది. ఈసారి మరో ప్రమోషన్ మీద.

అయినా ఈసారి నాకీ పదోన్నతి– ఆర్నెల్లలో రెండవది– ఏమంత సంతోషకరం కాలేదు.

తిరిగి సామానుతో మా ఊరు చేరాను. ఉద్యోగ బాధ్యతలూ స్వీకరించాను.

పనిలో పడితే నాకేదీ గుర్తుండదు.

చిత్రంగా నేనో విషయం గమనించాను.

ఇదివరలో కన్నా ఇప్పుడు నాకు తీరిక ఎక్కువే. రాత్రి ఎనిమిదికే పని ముగుస్తోంది. స్కూటర్ కూడా కొన్నాను. కానీ ఇదివరలోలాగా పనవగానే వీలు చిక్కినప్పుడల్లా నాగలక్ష్మి గారిల్లు చేరటం లేదు నేను.

ఆవిడ ఫోన్‌లో రమ్మన్నా ఏదో వంక చెప్పి తప్పించుకున్నాను. ఏదైనా పని వుండి, మెడికల్ కాలేజి వైపు వెళ్లినా వాళ్లింటికి మాత్రం వెళ్లడం లేదు.

అటు ప్రక్కగా వెళ్లడమే లేదు.

ఎందుకో వెళ్లాలనిపించడం లేదు.

నాలో ఈ మార్పు నాకే ఆశ్చర్యం కలిగించింది. అయినా నన్ను నేను మార్చుకునే ప్రయత్నమేమీ చెయ్యలేదు.

అలాగే ఒక పరాయి వ్యక్తిని గమనించినట్లు నా ప్రవర్తనని నేనే గమనిస్తూ, విస్తుపోతూ గడిపాను కొన్ని నెలలు.

అటుగా వెళ్తే ఆ బోసి వాకిలి చూడలేకపోయానేమో– అనుకున్నాను. కానీ అదేం కాదు. నేను మరీ అంత సున్నితమేమీ కాదు.

ఆ చెట్టు మరణం నన్నెంతో కదిలించింది. బాధపెట్టింది. కానీ ఇంతకు మించింది కూడా ఏదో జరిగింది.

నా మనసులో– ఒక శీతాకాలపు దీర్ఘరాత్రి సమయంలో చూసిన ఆ చెట్టు– తెల్లని పూల సౌకుమార్యం, సౌందర్యం, ముగ్ధత్వం, సౌరభం, మాదకత్వంతో కూడుకున్న ఆ పున్నాగ చెట్టు– ఆ

## సిగ్గు

రెడ్‌లైట్ ఏరియాలో
సిగ్గుని చితక్కొట్టే
రసిక రాజుల్ని చూసి
సిగ్గు మూగగా
కన్నీరు కారుస్తోంది!

*– జి.జి.కె. రావు.*

చెట్టు కొమ్మల అంచున ఉదయించిన చంద్రుడు- పున్నాగ పూల వాసనలద్దుకున్న వెన్నెల- తన శీతలత్వాన్ని పున్నాగచెట్టుకు ఆపాదించిన వెన్నెల- చంద్రుడిని శిఖామణిగా చేసుకున్న పున్నాగచెట్టు- ఒక ప్రత్యేకతనూ, ఒక విశిష్ట స్థానాన్ని ఆపాదించుకుని అట్లాగే ఉండిపోయింది.

ఆ చెట్టు నాలో ఒక క్రొత్త శాంతిని- అంతకుముందు నేనెరుగని శాంతిని ఆవిష్కరించింది. అది- బహుశా అదే నేను మరచిపోలేకపోతున్నది- అని నా ప్రవర్తనకు నేను అర్థం చెప్పుకున్నాను. కొన్ని నెలలు గడిచాయి.

కానీ నేను నాగలక్ష్మి గారింటికి వెళ్లలేకపోయాను- ఎప్పుడైనా వెళ్లినా పూర్వంలా స్నేహంగా ఉండలేకపోయేదాన్ని. ఎప్పుడైనా ఫోన్‌లో పలకరింపులే.

ఏదో సందర్భంగా సాహిత్యం పేజీకి వ్యాసం వ్రాస్తుంటే- నాకు రావిశాస్త్రి గారి మామిడిచెట్టు కథ జ్ఞాపకం వచ్చింది. అద్దెవాడిని ఆకర్షించి ఇంట్లో దింపి, తన నిష్క్రమణతో అతడిని ఇల్లు ఖాళీ చేయించగలిగిన మామిడిచెట్టు.

అప్పుడే నాకో సత్యం- పరమ సత్యం- స్ఫురించింది. మనుష్యులు- మనసులు- వాటి మధ్య మమతలు- ఇవే కాదు- మానవుడికీ- ప్రకృతికీ మధ్య కూడా ఇలాంటిదే ఒక సజీవ సంబంధం- మానసిక సామీప్యం ఉంటుంది.

ఆ మానసికమైన దగ్గరతనమే మానవులని సౌందర్య పిపాసులని చేస్తుంది. ఆ సౌందర్య పిపాస- ఆ ప్రకృతి పట్ల ఆకర్షణ మనిషిని సత్యాన్వేషణకి పురిగొల్పుతుంది. మానసిక ప్రపంచానికి తలుపులు తెరచి కొంగ్రొత్త లోకాలను మనలో ఆవిష్కరిస్తుంది.

అంటే మన బాహ్యావరణలో ప్రకృతి మన అంతశ్చేతనను జాగృతం చేస్తుందన్న మాట.

మన మానసిక ప్రపంచాన్ని విస్తృతం చేస్తుంది.

ఈ విషయం గ్రహించాక నా మనసు తేలికైంది.

నాగలక్ష్మి గారితో నా స్నేహానికి పునాది ఆమె స్నేహపాత్రత.

అయితే వాళ్లింటితో నాకు అనుబంధం ఏర్పడటానికి కారణం ఆ పున్నాగచెట్టు. ఆ చెట్టుతో నాకు ఏర్పడిన మానసిక సామీప్యం.

ఇప్పుడా చెట్టులేని ఖాళీతనం- ఆ లోటు- నేను భరించలేకపోతున్నాను. ఏదో బాగా విలువైనది- అమూల్యమైనది- నాకు దగ్గరైనది- బాగా ఇష్టపడినది పోగొట్టుకున్నట్లు- అదిక తిరిగి రాదనిపించి- ఎవరో కుటుంబ సభ్యుడో- ఆప్తమిత్రుడో చనిపోయినట్లు నేను బాధపడుతున్నాను.

అంతేకాదు, నాకింకో కర్తవ్యం కూడా స్ఫురించింది.

ఈ ఒక్క చెట్టు చనిపోతేనే నాకింత బాధగా ఉంది. ఆ ఇంటికి అంత లోటుగా, వెలితిగా ఉంది. కాలేజీ అందమే పోయిందనిపిస్తోంది.

మరి ప్రపంచవ్యాప్తంగా ఎన్నిచోట్ల, ఎంతమంది ఎన్ని లక్షల వృక్షాలను నరుకుతున్నారు? అమెజాన్ నది పరీవాహక ప్రాంతారణ్యాలు ఎలా కనుమరుగైపోయాయి? సతత హరితారణ్యాలు ఎలా మాయమవుతున్నాయి?

పర్యావరణం పట్ల మనిషికి ఉండవలసిన బాధ్యత- ఒక చెట్టు నరికేముందు అది ఆ స్థాయికి ఎదగటానికి ఎంత సమయం, శక్తి ఖర్చయ్యాయన్న స్పృహ- ఒక పెద్ద చెట్టు కొట్టేముందు అలాంటివి నాలుగు నాటాలన్న చైతన్యం. ఇవి మనకెందుకు లేవు?

ఈ విషయం స్ఫురించాక నాలో దిగులు తగ్గింది.

ఆ రోజే ప్రారంభించిన కొత్త శీర్షికకి "హరిత చైతన్యమ్" అన్న పేరు తట్టింది.

హుషారుగా లేచి బయటకు నడిచాను- నర్సరీ వైపు.

పున్నాగ మొక్కలు దొరుకుతాయేమోనని కనుక్కోవడానికి. అయితే నా స్మృతి పథం మాత్రం ఒక పాత మిత్రుడి వంటి- ఆపాత మధురమైన కవిత్వం వంటి- ఆ పాత పున్నాగచెట్టు తెల్లపూల సౌరభంతో నిండిపోయింది.

పున్నాగచెట్టు ఒక మధుర విషాదమైన జ్ఞాపకం.

●